# ఇదీ ఒక ప్రేమ కథ

యస్. వివేకానంద్

మావూరు మెట్రిక్ పరీక్షలకు పెద్ద నిలయం. 'అ-ఆ'లు దగ్గర్నుంచీ చదువుకో లేని వారికి మెట్రిక్ ఓ పెద్ద పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీలాంటిది.

పై పరీక్షల కోసం బోలెడుమంది భక్తులు వివిధ ప్రదేశాలనుంచి బంధుమిత్రులతోనూ, పేరెంట్సులేక గార్డియన్సుతోపాటు మావూరు తరలివచ్చి పరీక్షా తిరుచ్చాయలలో సేద తీర్చుకుని వెంకన్నగిరి (ఎగిరి) వెళ్ళిపోతారు.

కన్పించిన ముఖాలే ప్రతియేటా మళ్ళీ కన్పించటం కూడా రివాజే!

కొంతమంది పరీక్షలనే పేరుతో మావూరొచ్చేసి ఓ రెండు పచ్చనోట్లు ఖర్చుపెట్టుకుని తిరిగి వెళ్ళిపోవటమూ మామూలే.

పరీక్షలకు రెండురోజుల ముందు నుంచీ పూర్తిఅయ్యేవరకు.... వూరంతా జనసందోహంతో ఒకటే రద్దీ!

లాడ్జింగులకు, సినీమా హాళ్ళకీ, పచ్చిమిరపకాయ బజ్జీలకీ, ముంతకింద పప్పుకీ, మొక్కజొన్నపొత్తులకీ...కోకాకోలాకీ... క్వాలిటీ ఐస్ క్రీంకి, రిక్షావాళ్ళకీ... వగైరా వగైరా లన్నింటికీ భలే డిమాండు.

అనేక రకాల వూళ్ళనుంచి వచ్చేసే అనేక తరగతుల స్త్రీలు (పెళ్ళి అయినవారూ, కానివారూ, తల చెడినవాళ్లూ, తాతమ్మలూ) అనేక రకాల నవీన నాగరికత వుట్టిపడే డుస్తుల్లో...వారి వారి మాతృభాషలో మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ, అంగవిన్యాసాన్ని, అవయవాల్ని ప్రదర్శిస్తూ రోడ్ల మీద 'అలా అలా' నడిచి వెడుతూంటే వూళ్ళో వారందరికీ ఓ కొత్త సర్కస్ చూస్తున్నట్టుంటుంది.

మా వూరు పెద్ద సిటీ కాదు. పల్లెటూరు అంతకంటే కాదు. రెండూ కాని రెండో తరగతి రైలుపెట్టెలా వుంటుంది.

వూళ్ళో పెళ్ళికాని పిల్లలు (ఆడా+మగా) ప్రేమించుకుందుకు 'లవ్ రోడ్డు' ఒకటుంది. 'నైట్ డ్రీమ్స్'కి అందమైన పార్కు వుంది. రైళ్ళలో ప్రత్యేకమైన కంపార్టుమెంట్లు ఎలాగో అంతకంటే ప్రత్యేకంగా....రెండు లేడీ కాలేజీలున్నయ్.

మద్రాసుకో మెరినాబీచ్‌కి ఎంత ప్రాముఖ్యతో మా వూళ్ళో 'ఓవర్ బ్రిడ్జి' అంతకంటే ప్రముఖ పాత్రే వహిస్తుంది.

ఆ బ్రిడ్జిమీద నిల్చుంటే గాలి చల్లగా వీస్తుంది. సువాసనలతో మత్తెక్కిస్తుంది ఆ(డ)గాలి వూరంతా అందంగా రంగు రంగులుగానూ కన్పిస్తుంది.

'సెక్సు విస్కీ' మిళితమై ఎంతో ఆరోగ్యాన్ని కలిగించే ఆ వాతావరణం కోసం విరహ ప్రేమికులు, ఓల్డు డబుల్సు, మూడ్ కోసం విధవలూ, సరికొత్త రంగుల మేళవింపు కోసం చిత్రకార్లూ, కుర్రకార్లూ ... మరెన్నోకారులు సాయంత్రం ఐదు అయ్యేటప్పటికి వన్-బై-టు కాఫీ సేవించి కావు కావు 'మంటూ వచ్చి బ్రిడ్జిమీద వాల్తారు. (సారీ ; చేర్తారు)

గవర్నమెంటు ఆసుపత్రి మావూరికి మరోమాన్యుమెంటు.

హాస్పిటల్ ప్రహరీగోడ బయట పళ్ళ కొట్లవాళ్ళతోటి, కుష్టురోగులతోటి నిండుగా వుంటుంది. ఇహ లోపల...గొట్టం పేంట్లు, హిప్పీ క్రాపులూ, బెల్‌బాటమ్‌లూ, తిన్నది అరగని వారు మందుల కోసం వచ్చేవాళ్ళూ, మందగమనల కోసం వచ్చే వారితో కన్నుల పండుపుగా వుంటుంది.

కథకు పై విషయాలు సంబంధించేవి కావనుకుంటే క్షమించండి!

పై వూళ్ళనుండి వచ్చేసే అతిథులకు పై నుదహరించినవన్నీ ప్రత్యేకమైన యాత్రా స్థలాలు.

పోతే అసలు కథ సంగతి!.........

చిరంజీవి శ్రీహరిరావు కాకినాడ వాస్తవ్యులు చి. ల. సౌ. రాధాకుమారి మద్రాసు నేటివు.

వీరిద్దరి ప్రేమ కూడలి (అంటే రైల్వే జంక్షనులేదూ, ఆర్టీసి సిటీల స్టేషన్ లాంటిది) మావూరు.

పైవారిద్దరూ ఏకమై సినిమా డ్యూయెట్లు పాడుకోక పూర్వమే పరీక్షంటూ మా వూరొచ్చారు. (విడివిడిగానే సుమా!)

వారిద్దరూ నూసర్లు కాకపోవటంతో వెంట రాసేందుకు తోడెవరూ లేకుండా వంటరిగానే పరీక్షలు రాసేందుకు మా వూరి చెట్టు (హోటలు) కొమ్మలపై (గదుల్లో) వాలేరు (అద్దెకు దిగేరు).

ఒక ఆదివారం ఇంగ్లీషు సినిమాథియేటరు వీరిద్దరి చూపులనూ కలిపే అవకాశం తీసుకుంది. పైపెచ్చు వీరి ఇరువురి హృదయాల్లో ప్రేమ జ్వాల రగిల్చి రాయబారం (లేదూ ప్రేమ బేరం) జరిపించి, చీకట్లో ఇద్దరి చేతులూ కలిశాయి.

మర్నాడు సాయంత్రం పగటిపూటే లవ్ రోడ్డులో ఒకరికొకరు ఎదురయ్యారు.— హీరో చూపులకు హీరోయిన్ గుండె కరిగి నీరై నేలమీదపడి సైడుకాలువలోకిదొర్లింది. అమ్మాయి చిరునవ్వుకి అబ్బాయి మనసు ఆవిరై స్వేదబిందువుల ద్వారా అతగాడి శరీరంలోంచి పెల్లుబికింది.

ఒకరి మనసులు మరొకరికి ఇచ్చిపుచ్చుకున్నారు (పుస్తకాల్లాగా) మరో రోజు ఓవర్ బ్రిడ్జిమీద నిల్చుని.

పరీక్షలు తృప్తికరంగా రాయకూడదని నిశ్చయించుకున్నారు. ఎంచేతంటే .... ఇరువురూ ప్రేమించుకున్నారు. గనుక, ఏ ఒకరు పాసైనా మళ్ళీ కల్సుకునే అవకాశం వుండదు కనుక. భగ్న ప్రేమకు గురికావలసి వస్తుంది గనుకనూ....

పరీక్షలు పూర్తయి ఇళ్ళకు వెళ్ళేం దగ్గర్నుంచీ పేర్లు మార్చుకుని (అంటే రచయితలు కలంపేర్లు, పెన్సిలు పేర్లూ పెట్టు

(మిగతా 18వ పేజీలో)

## నిరీక్షణ

ఎవరిదో ఈపిలుపు
ఎందుకో ఈ ఆశ
ఏమిటో ఈ కలవరం
అర్థమేదో తెలియది బ్రతుకుకి

నీ తలపులతో, నీ ఆశలతో
నిండిన నీపేదగుండె
నీవొచ్చేవని, నీ పిలుపేనని
ఏ సవ్వడైనా ఎదురుచూసెను
చూసి అలసేను అలసేను ॥

నీ కన్నులలో ఆ తళుకు
నీ చెంపలలో ఆ మెరుపు
నీ చిరునవ్వుల వెన్నెలలు
నీ మాటలలో తేనియలు
నా కోసమేనని తలచాను మురిసాను॥

పగలే రేయై నీతలపులతో
ఆకాశాన చుక్కలు మెరిసే
అంతరంగాన చీకట్లుక్రమ్మె
చక్కని ఆ చందమామ
పక్కన నవ్వెను నను చూసి॥

—వాసవి

# ఇది ఒక ప్రేమ కథ

(4 వ పేజీ తరువాయి)

ఉన్నట్లు) వుత్తరాలు వ్రాసుకో సాగేరు.

రిజల్ట్సు వచ్చాయి!

సదరు శ్రీహరిరావు, రాధాకుమారిగార్ల నెంబర్లు జాబితాలో చోటుచేసుకోలేదు.

పరీక్ష పాసుకాకపోవటంలోగల బాధ్యత యూనివర్సిటీ వారిదే అనిన్నూ...... లేదా భాగ్యమీద కస్సు బుస్సు మనేసి, ఆ కోపంలో ఆన్సరు పేపర్లు సరిగ్గా దిద్దకుండా మార్కు-వేయని ఎగ్జామినర్ దే అనీ .... వారి వారి తల్లి దండ్రులు తలపోసి మళ్ళీ పరీక్షకు సంసిద్ధం కమ్మని చిరంజీవులను ప్రోత్స హించేరు వాళ్ళ పెద్దవాళ్ళు.

మావాళ్ళో మళ్ళీ ఒకరి ముఖాలొకరు చూచుకుని పరీక్షపాసైనదానికంటే ఎక్కువ సంబరపడ్డారు.

మార్చి పరీక్షల కొచ్చి నపుడు విడి విడి హోటలు గదుల్లో ప్రారంభమైన మెట్రిక్ ప్రేమ' సెప్టెంబరు నాటికి జరిగి దగ్గరై ఒకే రూమ్‌లోఅద్దెకుండేవరకూ ఎడ్వాన్సయింది.

ప్రేమవాడినీ, వేడినీ చవిచూస్తున్నారు. ఒకరి హృదయాల్లో మరొకరు ఇరుక్కుని నిద్రపోతున్నారు.

ఆఖరు పరీక్షరోజునఇద్దరిలోనూ దిగులు ఆరంభమైంది.

రూమ్‌లో కూర్చున్న శ్రీహరిరావుకి ఆక రన్పించటంలేదు. రాధాకుమారిలో బాధ పెరిగి పోతోంది.

"రాధా! ఇప్పటిదాకా పరీక్ష లెలా రాశావ్?"....అడిగారు.

"బాగానే రాశాను" ముక్తసరిగా అంది.

"హతవిధీ! బాగా రాశావా? చంపేశావ్. అట్లా యెందుకు రాశావ్?..." నిరుత్సాహం ప్రకటించేడు.

"ఏం చేయను. అన్నీ తెలిసినవే. రాయక తప్పలేదు మరి. ఖర్మ! ఈసారి పాసయ్యేట్టే వున్నాను..."

"ఎంత పాడుపని చేశావ్ రాధా. కొండంత నీ అండ చూచుకుని నేనసలు పరీక్షహాల్లోకే వెళ్ళటం మానేశాను." నిష్ఠూరంగాఅన్నాడు.

"పిచ్చి శ్రీహరీ! నా మాట నిజంగా నమ్మేవా?...పాసవ్వాలనుకుంటే.... మార్చి లోనే బాగా రాసి వుండేదాన్ని. సెప్టెంబరు కొచ్చింది ఎవరి కోసం?- కానీ .... మార్చి పరీక్ష పోయినందుకే నాన్నగారు ముఖం వాచేలా చీవాట్లు పెట్టేరు. ఎట్లాగో నచ్చచెప్పి ఇప్పుడు రాగలిగేను. అలాంటిది.. ఈసారి కూడా నెగ్గకపోతే?" అదోలా అంది రాధ.

"రాధా!. ఈ వక్కసారికీ నా మాటవిను. ఎట్లాగైనా మళ్ళీ మార్చి పరీక్షల కొచ్చేట్లు చూడు. తప్పదు. మనకోసం! కాదు.... మన పవిత్రప్రేమ కోసం నువ్వీ మాత్రంత్యాగం చేయక తప్పదు. మళ్ళీ కల్సుకునేలోగా మన విషయం మా నాన్నతో ఎలాగైనా చెప్పి ఒప్పిస్తాను. ఏం?-"

"ఏమోబాబూ...."అనేసిన రాధ ఒక్క క్షణం ఆలోచించి రావు కళ్ళల్లోకి సూటిగా చూచి పిలిపిగా నవ్వి అతగాడి తలమీద చెయ్యివేసి దువ్వి 'సరే' అంది.

"మనపవిత్రప్రేమ తప్పక వర్ధిల్లుతుంది" అంటూ రాధను కౌగిట్లో చేర్చుకున్నాడు. శ్రీహరి.

వారి పవిత్ర ప్రేమ వర్ధిల్లింది ఆరాత్రికి! అలాగే దినదినాభివృద్ధి చెందాలని 'పవిత్ర ప్రేమకు' మనసుల్లో 'జై' కొట్టారు.

పరీక్షలు ముగిశాయి!

ప్రేమికులిద్దరూ విడిపోయి ఒకే స్టేషన్లో చెరొక రైలూ ఎక్కేరు.

*

రాధాకుమారి సెప్టెంబర్లోకూడా సున్నా చుట్టడంతో తండ్రి ఉగ్రనరశింహు డయ్యాడు.

తండ్రిలో వచ్చిన మార్పు చూచి భయ పడ్డ రాధ తాను మళ్ళీ మార్చికెళ్లే అవకాశ ముండేదేమో అనుకొని కాకితో (కవర్లో వుత్తరం వ్రాసిపెట్టి) కబురెట్టింది (పోస్టు చేసింది).

ఇహ పోతే .... రెండుసార్లు పల్టీ కొట్టిన వాడు మూడోసారి మాత్రం పాసవుతాడనే గ్యారంటీ ఏమిటనేసి ఓ రోజు ఆలోచించాడు. శ్రీహరిరావు తండ్రి. ఏది ఏమైనా ఈసారైనా (అంటే మూడోసారి) తప్పక పాసవ్వాలంటూ శాసించాడు. పరీక్షకు మళ్ళీ వెళ్ళవలసిందిగా ఆదేశించాడు.

* * *

మళ్ళీ మార్చి 'మెట్రిక్' రుతువు' రానే వచ్చింది. శ్రీహరిరావు రాధాకుమారిగార్ల హృదయాలలో ఆనందం చిగిర్చింది.

ఈసారి ఇద్దరూ ఒకేమాట అనుకుని పరీక్షలు గట్టిగా రాశారు.

కానీ....?

పరీక్షలయ్యేక ఇద్దరూ ఇళ్ళకు తిరిగి వెళ్ళకూడదనీ, గాలిదుమారంలాగ (లేదా) గువ్వల జంటలాగా ఎగిరిపోయి ఏకమయ్యే టందుకే నిర్ణయించుకున్నారు.

* * *

కొసమాట :

శ్రీహరిరావు, రాధాకుమారీ ఎక్కడి కెళ్ళేరు? పెళ్ళిచేసుకున్నారా? ఏకమై సుఖ పడుతున్నారా? మరేమైనారు??

పిల్లతండ్రి అమ్మాయి తప్పి (పరీక్ష కాదు) పోయిందని పోలీసు రిపోర్టిచ్చేడా? పిల్లాడి తండ్రి 'అబ్బాయి కన్పించుట లేదు' (డబ్బుతో సహా) అనేసి పేపర్లో ప్రకటిం చేడా?

పైప్రశ్నలకు సమాధానాలు తెల్సినవారు (పెద్దవాళ్ళకు) తెలిపరిస్తే తగిన పారితో షికం ఇవ్వబడుతుంది.

★

వచ్చే వారమే 'ప్రగతి' పాఠకులకు

మరో సరికొత్త విజ్ఞాన శీర్షిక

"ఆరోగ్యనిధి"

నిర్వహణ : డా॥ నాగభైరవ ఆంజనేయులు

వైద్యరంగం బహు చిత్రమయింది. శాస్త్రజ్ఞుల నిర్విరామ కృషితో ఎన్నెన్నో సరికొత్త మందులు కనుగొంటున్నా - నేడు వస్తున్న అన్ని రోగాలకు, సరియైన మందులు లేవు. కొన్ని జబ్బులకు అసలు మందులే లేవు. కొన్నిటిని రాకుండా చేయ టానికి మందు లున్నాయేగాని, తీరా వచ్చాక నయం చేయటానికి ఏ మందులూ లేవు. అయితే, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మనం చాలా జబ్బులనుంచి తప్పుకోవచ్చు.

ఈ విషయాలను వివరంగా వారం వారం "ఆరోగ్య నిధి" శీర్షికలో పాఠకులకు అందజేయబోతున్నందుకు సంతసిస్తున్నాం. 'ప్రగతి' పాఠకులకు చిరపరిచితులయిన డా॥ నాగభైరవ ఆంజనేయులు, M. B. B. S. ఈ శీర్షిక నిర్వహిస్తారు.

— సం॥ 'ప్రగతి'